క్లుప్తంగా

విద్యార్థులకు ఆహార భద్రతపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో విద్యార్థులకు శనివారం ఆహార భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహార భద్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బీకే విద్యాసాగర్, బి. ఉదయనాథ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



కిర్లంపూడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వేలంక గ్రామాల్లో శనివారం స్థానిక ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జబీర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్సై బలరాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్



ప్రభుత్వాసుపత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

ఏలేశ్వరం: ప్రయాణికులకు నిలువ నీడ కల్పించేందుకు పట్టణంలో దాతలు నిర్మించిన బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద గతంలో దాతలు బస్ షెల్టర్ నిర్మించారు. దీని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. బస్ షెల్టర్, ఆవరణలో చెత్త పేరుకుపోవడంతో లోపలికి వెళ్లేందుకు ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అప్పట్లో ప్రయాణికుల సౌకర్యార్థం దాతలు ఈ షెల్టర్‌ను నిర్మించారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్త, వ్యర్థాలతో దర్శనమిస్తోంది. ప్రతిరోజూ బస్ షెల్టర్‌ను శుభ్రపరచడంతో పాటు పర్యవేక్షణ ఉంటే దాతల ఆశయం నెరవేరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రత్తిపాడు: గ్రామంలోని నిరుపేద విద్యార్థులకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ శనివారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసింది. ఈకిట్లను శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చారు. స్థానిక బజారు విధి రామాలయంలో పడాల శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, ఎస్ఎంఎస్ సంస్థ సభ్యులు జి.సత్యానందం, జె.జగదీశ్వరి, ఎస్.మణికంఠ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



మండపంలో హతమైన కొండచిలువ

శంఖవరం: మండలంలోని మండపం గ్రామంలోకి చొరబడిన కొండచిలువను శనివారం స్థానికులు హతమార్చారు. వివరాల్లోకి వెళితే...కొండ ప్రాంతం దగ్గరగా ఉండటంతో సుమారు ఏడు అడుగుల కొండ చిలువ మండపం గ్రామంలోకి చొరబడింది. దానికి చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పిల్లలు, మహిళలు పరుగులు తీయడంతో కొందరు యువకులు దానిని హతమార్చారు. గ్రామం చుట్టుపక్కల పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విషసర్పాలు, పురుగులు గ్రామంలోకి వస్తున్నాయని, రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అడవులు తరిగిపోవడంతో జనవాసాల్లోకి కొండచిలువలు ప్రవేశిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వసతులు ఫుల్.. చేరికలు డల్

- తిమ్మరాజుపేటలో అనువుగాని చోట బాలికల వసతిగృహం
- హాస్టల్‌లో చేరడానికి ఆసక్తి చూపని దూరప్రాంత విద్యార్థినులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



తిమ్మరాజుపేటలో ఉన్న బీసీ బాలికల హాస్టల్

కోటనందూరు: మారుమూల ప్రాంతంలో ఉన్న పేద విద్యార్థులకు అండగా ఉండి వారి ఉత్తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. దీనిలో భాగంగా విద్యార్థులకు అనువైన ప్రాంతంలో వసతి గృహాలు ఏర్పాటు చేసి రూ.లక్షలతో అన్ని వసతులు కల్పిస్తోంది. కాగా మండలంలోని తిమ్మరాజుపేట బీసీ బాలికల వసతి గృహం ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా నడుస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థినులకు ఈ హాస్టల్ అనువైన ప్రాంతంలో లేకపోవడంతో వారిని చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. విద్యార్థినులు తక్కువగా ఉండడంతో అధికారులు సైతం ఈ హాస్టల్‌ను ఇన్‌చార్జ్ వార్డెల ఆధ్వర్యంలో తూతూమంత్రంగా నడిపిస్తున్నారు. ఈ వసతిగృహం మారుమూల ప్రాంతంలో ఉండడంతో సోషల్ వెల్ఫేర్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం కొరవడింది. దశాబ్దాలుగా దయనీయ స్థితిలో కొనసాగుతున్న ఈ హాస్టల్‌పై సోషల్ వెల్ఫేర్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా..లక్ష్యం మాత్రం నెరవేరడం లేదనేది స్థానికుల వాదన. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ హాస్టల్‌ను విద్యార్థినులకు అనువైన ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరతున్నారు.

2004లో...

మండలంలోని పాతకొట్టాం పంచాయతీ పరిధిలోని తిమ్మరాజుపేట బీసీ బాలికల వసతి గృహాన్ని 2004లో నిర్మించారు. విద్యార్థినులకు ఇక్కడ అన్ని రకాల వసతులు ఉన్నాయి. అయినప్పటికీ ఈ హాస్టల్‌లో చేర్పించడానికి బాలికల తల్లిదండ్రులు మాత్రం ఆసక్తి కనబరచడం లేదు. 150 మంది విద్యార్థినులకు వసతి కల్పించగల సామర్థ్యం కలిగిన ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 50 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. వారు కూడా స్థానిక విద్యార్థినులే కావడం విశేషం. ఈ దుస్థితికి కారణాలు పరిశీలిస్తే హాస్టల్ భవనం ఉన్న తిమ్మరాజుపేటలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండడంతో ఈ హాస్టల్‌లో విద్యార్థినులు ఉన్నత పాఠశాల కోసం ఇటు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతకొట్టాం గానీ, అటు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేతః చిన్నయ్యపాలెం గాని వెళ్లవలసి వస్తోంది. అలాగే హాస్టల్ నుంచి ఉన్నత పాఠశాలలకు ఉచింతంగా ప్రయాణం చేసే అవకాశం ఉన్నప్పటికీ సమయానికి బస్సులు రాకపోవడం, నడిచి వెళ్లడం వల్ల ఆరోగ్య, ర్యాగింగ్ సమస్యలు తలెత్తడంతో ఈ హాస్టల్‌లో చేరేందుకు విద్యార్థినులు ఆసక్తి చూపడం లేదు.

ఇన్‌చార్జి వార్డెన్‌లతోనే నిర్వహణ

సోషల్ వెల్ఫేర్ అధికారులు ఈ హాస్టల్‌పై వివక్షత చూపుతున్నారు. గతేడాది ఈ హాస్టల్‌ను అనువైన ప్రాంతానికి మారుస్తామని సంబంధిత జిల్లాస్థాయి అధికారులు ప్రకటించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఈ హాస్టల్లో విద్యార్థినుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఏళ్ల తరబడి ఇన్‌చార్జ్ వార్డెన్‌లతోనే నిర్వహణ సాగిస్తున్నారు. ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తున్నా ఆ స్థాయిలో విద్యార్థినులకు సౌకర్యాలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌చార్జ్ వార్డెన్ల నిర్వహణలో హాస్టల్ నిర్వహణ అంతంత మాత్రంగానే మారింది.

హాస్టల్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి



తిమ్మరాజుపేట హాస్టల్ పిల్లలకు అనువుగాని ప్రాంతంలో ఉంది. దీంతో ఇక్కడ ఎవరూ చేరడానికి ఇష్టపడడం లేదు. హాస్టల్‌ను హైస్కూల్ ఉన్న గ్రామానికి తరలిస్తే ఎక్కువ మంది పిల్లలు చేరే అవకాశం ఉంది. అధికారులు ఆ దిశగా ఆలోచించి చర్యలు తీసుకోవాలి. ఈ హాస్టల్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడింది.

– పీవీ నరసింహారావు, పాతకొట్టాం

ప్రజల పక్షాన పోరాటం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ రాంబాబు

గోకవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాటం చేస్తామని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో శనివారం వైఎస్సార్ సీపీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకులు దాసరి చినబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా తీర్పును గౌరవిస్తూ బాధ్యతతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో ఏ కార్యకర్తకు సమస్య వచ్చినా అండగా ఉంటామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ నేత సుంకర వీరబాబు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, సర్పంచులు బత్తుల శ్రీను, కమ్మెల అచ్చిబాబు, ఎంపీటీసీ మద్దూరి రామకృష్ణ, నాయకులు ఉంగరాల ఆదివిష్ణు, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, రౌతు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ ఉత్సవ విగ్రహాల వితరణ



వీరబ్రహ్మేంద్రస్వామి పంచలోహ విగ్రహాలను అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి గోకవరానికి చెందిన విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పంచలోహ విగ్రహాలు వితరణ చేశారు. రూ.36 వేల విలువ చేసే వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ పంచలోహ ఉత్సవ విగ్రహాలను శనివారం అందజేశారు. త్వరలో సిద్ధప్ప విగ్రహాన్ని కూడా అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు యండమూరి శ్రీనివాస్‌రావు, దుర్గాప్రసాద్ శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో సమితి సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి కాలినడకను వచ్చి ప్రదక్షిణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాఠశాలకు బెంచీల బహూకరణ



బెంచీలను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు రూ.40 వేల విలువ చేసే బెంచీలను రోటరీ క్లబ్ ప్రతినిధులు బహూకరించారు. క్లబ్ ప్రతినిధులు పాఠశాల హెచ్ఎం స్వామికి శనివారం బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు కేఎస్ఎల్ఎస్ వర్మ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం స్వామి అభ్యర్థన మేరకు బెంచీలను బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కిషోర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ బుచ్చిరాజు, ట్రెజరర్ ఈశ్వర్, గణేష్, మంగరాజు, వీర్రాజు, మోహనకృష్ణ, వివేక్, నర్సిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన



చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: మండల పరిధిలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద శనివారం కార్మికులు ఆందోళన చేశారు. ఫాక్టరీలో పని చేస్తున్న కార్మికుల తొలగింపునకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద కార్మికుల ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఫాక్టరీలో కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు.

యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదన్నారు. కార్మికుల తొలగింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాల్మన్‌రాజు, నాని, సుబ్బారావు, అప్పారావు, చిన్ని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులను అరికట్టాలి

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం జిల్లాలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని, ఈ దాడులను పోలీసు యంత్రాంగం అరికట్టాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ లీగల్ సెల్ ఇంచార్జి పలివెల నాగేంద్ర రాజు శనివారం ఓ ప్రకటనలో కోరారు. బాధితుల ఫిర్యాదుల మేరకు తగిన విచారణ జరిపి నిందితులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో న్యాయం జరగకపోతే బాధితులు కాకినాడ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా కంప్లయింట్ పంపాలని, తద్వారా గౌరవ కోర్టుల్లో ఫిర్యాదు దాఖలు చేసి కేసు నమోదు చేయిస్తామని తెలిపారు. దాడుల సమయంలో సెల్ ఫోన్ ద్వారా ఫొటోలు, వీడియోలు చిత్రీకరించాలని, అవి కేసులో బాధితులకు సాక్ష్యాగా ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు జరిగితే 95156 05566, (పలివెల నాగేంద్ర రాజు), 9490715369, (కాకరపల్లి లోవదుర్గ) 94417 55442 (బెహరా లక్ష్మీప్రసన్న) నంబర్లకు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందాలని సూచించారు.

ధారపల్లి జలపాతం వద్ద యాత్రికుల సందడి



ధారపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లి జలపాతం వద్ద శనివారం యాత్రికులు సందడి చేశారు. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడం, రెండో శనివారం సెలవు దినం కావడంతో ధారపల్లి జలపాతానికి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో సహా జలపాతం వద్ద ఆటపాటలతో గడిపారు. జలపాతం వద్ద సాయంత్రం వరకూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. యువత ఆట పాటలతో సందడి చేశారు.

పత్తి సాగుకు రెడీ



ఎన్.చామవరంలో పత్తి సాగుకు ట్రాక్టర్‌తో దుక్కు చేస్తున్న దృశ్యం

- దుక్కులు చేసి భూములను సిద్ధం చేసిన రైతులు
- నెలాఖరుకు నాట్లు పూర్తి చేసేలా సన్నాహాలు

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో రైతులు పత్తి సాగుకు భూములను సిద్ధం చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఈ వారంలో నాట్లు ప్రారంభించి నెలాఖరుకు పూర్తి చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కాకినాడ జిల్లాలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం, పత్తిపాడు, గొల్లప్రోలు, కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం, ఏలేశ్వరం మండలాల్లో ప్రతి సంవత్సరం రైతులు పత్తిసాగు చేస్తున్నారు. ఈ మండలాల్లో గతేడాది ఐదు వేల ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉండడంతో ఈసారి మరింత ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పత్తిసాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నారు. తుని మండలంలోని ఎస్.చామవరం, వి.కొత్తూరు, ఎ.అగ్రహారం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, హంసవరం, ఎస్.అన్నవరం, చేపూరు, గవరపేట, టి.వెంకటాపురం తదితర గ్రామాల్లో రైతులు పత్తిసాగు ఎక్కువగా చేస్తారు. ఈ ఏడాది రైతులు ఇప్పటికే పత్తిసాగుకు దుక్కులు పూర్తి చేశారు. విత్తనాలు నాటిన తర్వాత నాలుగైదు రోజుల్లో వర్షాలు కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వర్షాభావ పరిస్థితుల ఆధారంగా పత్తినాట్లు వేస్తారు.

నేడు నేరేళ్లమ్మ ఆలయ వార్షికోత్సవం

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో వేంచేసిన నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. అమ్మవారికి ఉదయం 5 గంటలకు పంచామృతాలు, సప్తనదీ జలాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అనంతరం చండీహోమం, మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఘాటెక్కిన ఆవకాయ!

- భారంగా మారిన ఆంధ్రా స్పెషల్ ఆవకాయ తయారీ
- తగ్గిన మామిడి దిగుబడి
- పెరిగిన మిర్చి, మసాలా దినుసుల ధరలు



పిఠాపురంలో ఆవకాయ పచ్చడికి మామిడి ముక్కలు కోస్తున్న మహిళ



పచ్చళ్ల కోసం ఇతర ప్రాంతాలకు పంపేందుకు సిద్ధం చేస్తున్న పచ్చి మామిడి కాయలు

పిఠాపురం: వేసవి వచ్చిందంటే చాలు ఉభయ గోదావరి జిల్లాలోని ప్రతిఇంటా ఆవకాయ పచ్చడి ఘుమఘుమలు వెదజల్లుతాయి. పట్టణం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిని ఆవకాయ ఆహ్వానిస్తుంటే ఊరగాయలు ఊరిస్తాయి. ఆంధ్రులంటే ఆవకాయ గుర్తుకొస్తుంది. ఆవకాయ ఆంధ్రాలో పుట్టి దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి పొందింది. కొత్త ఆవకాయ పేరు వింటేనే నోరూరిపోతుంది. వేసవిలో వేడిసెగలు కుక్కుతున్నా వడగాడ్పులు వీస్తున్నా ఆంధ్రాలో ప్రతి ఇంటా ఆవకాయ పచ్చడి తయారీ మాత్రం జోరుగా సాగుతుంది. రుచిలో ఉన్నట్లే దీని తయారీ సైతం ఒక పెద్ద ప్రహసనమే అని చెప్పొచ్చు. వేసవిలో పప్పు, నెయ్యి, ఆవకాయ కాంబినేషన్‌తో భోజనాలు తప్పనిసరిగా ఉంటాయి. అలాంటి ఆవకాయ పచ్చడి తయారీ ప్రస్తుతం పెనుభారంగా మారింది. తగ్గిన మామిడి దిగుబడి, పెరిగిన మామిడి, కారం, మసాలా దినుసుల ధరలు ఆవకాయ తయారీకి అడ్డంకిగా మారాయి.

ధరలకు రెక్కలు

పచ్చళ్లకు ఉపయోగించే చెరకు రసం, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టరు మామిడి కాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం వల్ల వాటికి మంచి గిరాకీ ఏర్పడింది. ఆరోగ్య ప్రదాయినిగా చెప్పబడే మామిడిని తినని వారుండరు. ముఖ్యంగా పీచు అధికంగా గల బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి మామిడి పండ్లకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. కలెక్టరు, కొబ్బరిమామిడి వంటి పచ్చి మామిడి కాయలను ఊరగాయలకు ఎక్కువగా ఉపయోగిస్తారు. అందువల్ల మామిడి సీజన్ ప్రారంభంలోనే వీటికి గిరాకీ పెరుగుతుంది. ఊరగాయలకు ఉపయోగించే కేజీ పచ్చి మామిడి కాయలు రూ.45 నుంచి రూ.55 వరకూ ధర పలుకుతోంది.

48 వేల హెక్టార్లలో మామిడి సాగు

జిల్లాలో ఏజెన్సీ మెట్ట ప్రాంతాలతో పాటు పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 48 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం మామిడి కాయలు, పండ్లను కాకినాడ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. నిత్యం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 టన్నులకు పైగా మామిడి కాయల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆవకాయ పచ్చడికి ఎక్కువగా ఉపయోగించే కొత్తపల్లి కొబ్బరి మామిడి 100 కాయలు రూ.6 వేలు పలుకుతున్నాయి. సాధారణ రకాలైన రసాలు ధర ఒక్కో కాయ గతేడాది రూ.20 ఉండగా ఈ ఏడాది రూ.36కు పెరిగింది. సువర్ణరేఖ రూ,12 నుంచి రూ.25కు పెరిగింది. చిన్న రసాల ధర రూ.15 నుంచి రూ.25కు పెరిగింది. దేశవాళీ రకం మామిడి కాయలు ధర రూ.10 నుంచి రూ.25 వరకు పెరగడంతో ఆవకాయతో పాటు నిల్వ పచ్చళ్ల తయారీ సైతం సామాన్యులకు పెనుభారంగా మారింది. వీటికి తోడు పచ్చళ్లలో ఉపయోగించే ఎండు మిర్చి, ఆవాలు, వెల్లుల్లి వంటి మసాలా దినుసుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పచ్చళ్ల తయారీ పెనుభారంగా మారిపోయింది.

ఆవకాయ పచ్చళ్లలో రకాలు

తీపి ఆవకాయ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేకం. ఆంధ్రా ఆవకాయ గోదావరి జిల్లాలకు ప్రత్యేకం. ఆవ పిండితో పెట్టే ఆవకాయతో పాటు అల్లం ఆవకాయ, బెల్లం ఆవకాయ, మాగాయ, కాయ ఆవకాయ, పులిహోర ఆవకాయ, పెసర ఆవకాయ, నువ్వు పొడి ఆవకాయ, మెంతి ఆవకాయ, తురుము మాగాయ, నీళ్ల ఆవకాయ, కొబ్బరి ఆవకాయ, పచ్చ ఆవకాయ, తొక్కు మాగాయ, శనగల ఆవకాయ, వెల్లుల్లి ఆవకాయ, ఉడుకు మాగాయ, పిండె మాగాయ, ఎండు ఆవకాయ వంటి ఎన్నో రకాల పచ్చళ్లను పెడతారు.

సాధారణంగా వ్యాపారులు దుఖానాల్లో అమ్మే కారంతో పచ్చళ్లు తయారు చేస్తారు. కాని గృహాల వద్ద సొంతంగా తయారు చేసుకునే వారు మాత్రం పచ్చడికి వాడే కారంలో అత్యంత జాగ్రత్తలు పాటిస్తారు. నాణ్యమైన మిరప కాయలనే కొని బాగా ఎండబెట్టి ఇళ్ల వద్దే గ్రైండ్ చేసుకుని పచ్చడికి వాడుతుంటారు. మిరప పంటకు పెట్టింది పేరైన గొల్లప్రోలు మండలంలో పలు గ్రామాల్లో మిరప సాగుతో పాటు దిగుబడి సైతం భారీగా పడిపోయింది. దీంతో మిర్చి రేటు సైతం ఘాటెక్కింది. పచ్చడి మిర్చి ధర కేజీ రూ.300 పలుకుతుండగా ఒక కేజీ కారం తయారీకి రూ.800 వరకూ ఖర్చవుతుండడంతో పచ్చడి తయారీ దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి దిగుబడి తగ్గింది



ఈ ఏడాది మామిడి దిగుబడులు బాగా తగ్గాయి. పెట్టుబడులు పెరిగాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో పూత నిలబడలేదు. మామిడికి డిమాండ్ పెరగడంతో రేటు బాగున్నప్పటికీ దిగుబడి లేక రాబడి తగ్గిపోయింది. ముఖ్యంగా పచ్చళ్లకు వాడే కొత్తపల్లి కొబ్బరి, రసాలు, సువర్ణరేఖ వంటి రకాల దిగుబడి తక్కువగా ఉంది. తెగుళ్లు విజృంభించడంతో కాయల్లో నాణ్యత లేక కొనుగోళ్లు మందగించాయి.

– పదిలం రామన్నదొర, మామిడి రైతు, గొల్లప్రోలు మండలం